## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మాదాపూర్, మార్చి 21: ఫీడర్ మరమతుల కారణంగా చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని చందానగర్ ఏఈ దీప్తి తెలిపారు. 11 కె.వి. మార్తాండ నగర్ ఫీడర్ పరిధిలోని మార్తాండ నగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3:30 నుంచి ఐదు గంటల వరకు, 7 కె.వి. హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలోని ప్రకాశ్ నగర్, అక్షయ ఎలైట్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల వరకు, 11 కె.వి. ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలోని ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, ప్రకాశ్ నగర్, వినాయక్ నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3:30 నుంచి 4:30 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు తెలిపారు.

## రేపు ఉచిత వైద్యశిబిరం

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 21: కేపీహెచ్‌బీ కాలనీ 4వ రోడ్డులోని కే కే రెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యశాల నిర్వాహకులు తెలిపారు. రేపు (ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరంలో డాక్టర్ ఐ.ధనలక్ష్మి పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధుమేహం, ఫాటీ లివర్, మద్యపానం అలవాటు ఉన్నవారు, ఉబకాయంతో బాధపడుతున్న వారు పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 8143010104, 9154 938412 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# ఆక్రమణల్లో సర్వీస్ రోడ్లు ..తప్పని కష్టాలు



జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ సమీపంలో సర్వీసు రోడ్డుపై నిర్మాణ సామగ్రి



షాపూర్‌నగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో రోడ్డుపైనే ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

జగద్గిరిగుట్ట, మార్చి 21: జీహెచ్‌ఎంసీ పరిధిలోని రెండు మున్సిపల్ సర్కిళ్లు, ఇండస్ట్రియల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారి ప్రయాణికులకు కష్టాలు, ట్రాఫిక్ పోలీసులకు ఇబ్బందులు కలిగిస్తున్నది. ఇండస్ట్రియల్, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో సర్వీస్‌రోడ్లు ఆక్రమణలమయంగా మారాయి.

ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు పోలీసులు శ్రమించాల్సి వస్తోంది. దూలపల్లి చౌరస్తా నుంచి జీడిమెట్ల పారిశ్రామిక వాడమీదుగా వాహనాలు వెళ్లేలా డైవర్షన్లు ఏర్పాటు చేశారు. సాగర్ హోటల్ వద్ద జీడిమెట్ల పారిశ్రామికవాడ వెళ్లేదారిని మూసి వేశారు. అయినా.. సర్వీస్ రోడ్లను సరిదిద్దక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సమస్య వాహనదారులకు అనుకుంటే పొరపాటే ట్రాఫిక్ పోలీసులకు సైతం ఈ ఇబ్బందులు తప్పడం లేదు. సర్వీస్ రోడ్లు ఆక్రమణలో ఉండటంతో సూరారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, షాపూర్ నగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి సమీపంలో రోడ్డు మీదే వాహన తనిఖీలు చేపడుతున్నారు. పోలీసులను తప్పించుకునే ప్రయత్నంలో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

### కుత్బుల్లాపూర్, గాజుల రామారం

### మున్సిపాలిటీ పరిధిలో..

కుత్బుల్లాపూర్, గాజుల రామారం మున్సిపాలిటీ పరిధిలోని నర్సాపూర్ ప్రధాన రహదారి జీడిమెట్ల పారిశ్రామిక వాడను అనుసంధానిస్తోంది. మెదక్ నుంచి బాలానగర్ మీదుగా నగరానికి ప్రధానమార్గం కావడంతో విపరీతమైన రద్దీ ఉంటుంది. ప్రధాన ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు కబ్జా కావడం వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రంగారెడ్డి నగర్ డివిజన్ ఆదర్శనగర్ ప్రాంతంలో విశాలమైన సర్వీస్ రోడ్డు ఉన్నా.. వాహనదారులు తోపుడుబండ్లు చిరు దుకాణాలతో ఆక్రమణలకు గురైంది.

ఐడీపీఎల్ కూడలి మాత్రమే విస్తరించి పెట్రోల్ పంపు సమీపంలోని సర్వీసు రోడ్లను అలాగే వదిలేశారు. ఉషోదయ టవర్స్ నుంచి రైతు బజార్ వరకు షాపూర్ నగర్‌లో సర్వీస్ రోడ్లు ప్రాంతాన్ని దుకాణదారులు హోటళ్ల నిర్వాహకులు ఆక్రమించుకున్నారు. రైతు బజార్ సమీపంలో సర్వీసు రోడ్డుపై నిర్మాణాలు చేపట్టి ఏండ్లు గడుస్తున్న పట్టించుకోవడం లేదు. రైతు బజార్ నుంచి విద్యుత్ సబ్ స్టేషన్ చౌరస్తా వరకు ఉన్న అడ్డంకులు తొలగించాల్సి ఉన్నది. దూలపల్లి చౌరస్తా నుంచి పారిశ్రామిక వాడమీదుగా సూరారం వరకు పరిస్థితి అలాగే ఉన్నది.

### వ్యాపారాలు సాగిస్తున్నారు..

డిపో నుంచి సూరారం వరకు ఉన్న ప్రాంతంలోని సర్వీసు రోడ్లను పారిశ్రామిక పరికరాలు, నిర్మాణ సామగ్రి విక్రయించుకునే వారు ఆక్రమించుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. సర్వీసు రోడ్డు ప్రాంతాల్లో అడ్డంకులు తొలగించి పార్కింగ్ వాహనాల డైవర్షన్, ట్రాఫిక్ తనిఖీలకు ఉపయోగించుకోవాలని పలువురు కోరుతున్నారు.



రైతు బజార్ సమీపంలో సర్వీస్ రోడ్డుపై ఫ్రూట్స్ దుకాణం

## ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్



కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 21 : ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేసే నైతిక హక్కు లేదని కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించి, పేదలకు అందించారని, నగరాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి చేయడంతో.. నగరంలోని ప్రజలంతా బీఆర్‌ఎస్‌ను ఆదరించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మి మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలన్నింటిని పరిష్కరించిన ఎమ్మెల్యే పై ఆరోపణలు చేయడం సిగ్గు మాలిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. మీ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్‌రాజకీయాల్లోకి తీసుకొచ్చి ప్రోత్సహించిన మా నాయకుడిని విమర్శించే హక్కు మీకు లేదన్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం కోసం పనిచేశాడన్నారు. కర్మకొద్దీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో.. నియోజకవర్గానికి నిధులు నిలిపివేసి పనులు చేయకుండా అడ్డుకుంటూ.. అబద్ధపు ఆరోపణలు చేయడం ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. నిత్యం అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మోసగించే అలవాటు ఉన్న కాంగ్రెస్ నాయకులు అవాకులు సేవకులు పేల్చడం మానుకుంటే మంచిదని హితవు పలికారు. ఎన్నికలలో మోసపోయిన ప్రజలు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కి తగిన విధంగా గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

## పూడికతీత పనులు పరిశీలన



బాలానగర్, మార్చి 21 : నాలా పూడికతీత పనులను సమగ్రంగా నిర్వహించాలని బాలనగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలో జీడిమెట్ల నుంచి బాలానగర్ మీదుగా ఫతే నగర్ వెళ్లే కెమికల్ నాలా పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కెమికల్ నాలా పూడికతీత పనులలో ఇలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్రంగా చేసేలా చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. నాలా పూడికతీత సమయంలో సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి పనులను పూర్తి చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే ఎక్కడి వ్యర్థాలు అక్కడే వదిలేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.

# కురిసిన వాన..నిలిచిన విద్యుత్



నిజాంపేటలోని శ్రీ చైతన్య కాలేజ్‌వద్ద కురుస్తున్న వాన

దుండిగల్, మార్చి 20 : కొద్దిపాటి వర్షానికే కరెంట్ కట్ అయింది. దీంతో దోమల మోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో 5 నిమిషాల పాటు వర్షం కురిసింది. ప్రధానంగా నిజాంపేట ,బాచుపల్లి, ప్రగతి నగర్, దుండిగల్ , గండి మైసమ్మ, బహదూర్ పల్లి, సూరారం, రాజుల రామారం , జగద్గిరిగుట్ట, ఐడీపీఎల్ చౌరస్తా, సుచిత్ర తదితర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఐదు నిమిషాల పాటు ఓ మోస్తారు అన్న కురిసింది. వాన మొదలైందో లేదో ఒకసారిగా కరెంట్ కట్ అయి చీకట్లో అమ్ముకున్నాయి. అసలే ఎండాకాలం ఆపై దోమలు విజృంభించడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. వాన వెలసిన అరగంట తర్వాత గాని విద్యుత్ అధికారులు కరెంటు సరఫరాను పునరుద్ధరించారు. దీంతో అరగంట పాటు జనం దోమలతో ఫైట్ చేయాల్సి వచ్చింది.

### కాస్త తగ్గిన ఉష్ణోగ్రత..

నియోజకవర్గ పరిధిలో ఐదు నిమిషాల పాటు వాన పడగా కొద్దిగా వాతావరణం చల్లబడింది. వాన పడింది ఐదు నిమిషాలు మాత్రమే అయినా పడినంతసేపు వర్షంగట్టిగా కురవడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో కొద్దిగా వాతావరణం చల్లబడడంతో, అప్పటివరకు దోమలు మోత, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

## లైంగికదాడి కేసులో.. నిందితుల రిమాండ్


జగద్గిరిగుట్ట, మార్చి 21 : లైంగిక దాడి కేసులో ముగ్గురిని శుక్రవారం జగద్గిరిగుట్ట పోలీసులు రిమాండ్ తరలించారు. సీఐ నరసింహ తెలిపిన వివరాల మేరకు.. వికారాబాద్, ఎల్లమ్మబండ ప్రాంతాలకు చెందిన ఇద్దరు మహిళలు కూకట్‌పల్లి ప్రాంతంలో వ్యభిచార వృత్తి కొనసాగిస్తున్నారు. ఈ నెల 19న ఎల్లమ్మబండ వద్ద వారు వెళ్తుండగా ముగ్గురు వీరితో మాట్లాడారు. బాధిత మహిళ (35) ఓ విటుడితో ప్రగతినగర్ చెరువు ప్రాంతానికి వెళ్లింది. అనంతరం మరో ఇద్దరు ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదుతో ఎల్లమ్మబండకు చెందిన రవీందర్ సింగ్, గోవింద్ సింగ్, రూప్ సింగ్‌ను రిమాండ్‌కు పంపారు.

## హే ధమ్ వీధి నాటిక ప్రదర్శన



తెలుగు విశ్వవిద్యాలయంలో నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

దుండిగల్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో హైదరాబాద్ రంగస్థల కళల శాఖ ద్వితీయ సంవత్సరం ప్రాయోగిక పరీక్షలో భాగంగా రంగస్థల కళల శాఖ విద్యార్థులచే హే దమ్ ఆధునిక వీధినాటిక శుక్రవారం ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా తెలుగు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు , శాఖ అధిపతి డా. బీహెచ్ పద్మప్రియ హాజరయ్యారు. ప్రధాన ఇతివృత్తం నేటి యువత మాదకద్రవ్యాలకు బానిసలై ఎలా తన జీవితాల్ని పతనం చేసుకుంటున్నారో చక్కగా తెలియచేసిందని వక్తలు ప్రశంసించారు. రచన, దర్శకత్వంచ నిర్వహణ బాగుందన్నారు. ముఖ్యంగా ఇతివృత్తం విద్యార్థులకు ప్రేరణ కావాలని, డ్రగ్స్ రహిత రాష్ట్రం అవ్వాలని విద్యార్థులంతా నాటికను ప్రేరణగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో తమవంతు కృషి చేస్తూ మహమ్మారి వలలో పడకుండా చూడాలన్నారు.



## జిల్లా దవాఖాన సందర్శన

కొండాపూర్, మార్చి 21 : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రంగారెడ్డి జిల్లా దవాఖానను శుక్రవారం కామారెడ్డి డీసీహెచ్‌ఎస్ డాక్టర్ విజయలక్ష్మి తన బృందంతో కలిసి సందర్శించారు. దవాఖాన సూపరిండెంట్ అనురాగిణి రెడ్డి విచ్చేసిన బృందానికి దవాఖానలో అందుతున్న వైద్య సేవలు, పరిశుభ్రతపై తీసుకుంటున్న చర్యలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ అభియాన్ ద్వారా చేపడుతున్న పరిశుభ్రత, పచ్చదనం లక్ష్యాన్ని డాక్టర్ విజయలక్ష్మి వివరించారు. కాయకల్ప అసెస్మెంట్‌ను చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్ చంద్రకాంత్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మాదాపూర్, మార్చి 21 : ఆర్థిక ఇబ్బందులతో ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మియాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మయూరినగర్‌లో ఎర్రవెల్లి నరేందర్ (38) భార్య మమత, కూతురుతో కలిసి ఉంటున్నారు. నాలుగు నెలల కింద బాచుపల్లిలో రేణు కిచెన్ హోటల్‌ను ప్రారంభించాడు. సరిగ్గా నడవకపోవడంతో అప్పుల పాలయ్యాడు. దానికి తోడు కుటుంబం పరిస్థితి బాగాలేక అప్పులు చేశాడు. దీంతో మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో పది రోజుల క్రిందట భార్య మమత కూతురుతో కలిసి బాచుపల్లిలో ఉంటున్న వారి అమ్మ ఇంటికి వెళ్లింది. శుక్రవారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో నరేందర్ భార్య మమతకు ఫోన్ చేసి అప్పుల బాధ భరించలేకపోతున్నానని బాధపడ్డాడు. మమత మల్కాజ్‌గిరి వెంకటేశ్వర నగర్ కాలనీలో ఉంటున్న తన మామ సిద్దయ్యకు ఫోన్ చేసి నరేందర్ బాధపడుతున్నట్లు తెలిపింది. నరేందర్ తండ్రి సిద్దయ్య కుమారుడు ఉంటున్న ఇంటికి తెల్లవారుజామున 4: 30 గంటల చేరుకొని చూడగా హాల్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. దగ్గరకు వచ్చి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు గుర్తించాడు. మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. నరేందర్ తండ్రి సిద్దయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జీడిమెట్ల, మార్చి 21 : ఓ వ్యక్తి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6న షాపూర్ నగర్ మార్కెట్‌లోని అనుష అపార్ట్ మెంట్ ఎదుట 40-45 ఏండ్లు ఉన్న వ్యక్తిని చూసి వివరాలు అడిగితే, పేరు గోపాల్ అని, రోడ్డుపై భిక్షాటన చేస్తానని, కడుపు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని నిర్ధారించారు. దాంతో శ్రీధర్ 100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి బంధువు పి.మణిరత్న కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## గుర్తు తెలియని వ్యక్తి..

జగద్గిరిగుట్ట : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు వివరాల మేరకు.. గాజులరామారం డివిజన్ ఉషా ముళ్లపూడి సమీపంలో గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి (55) అపస్మార స్థితిలో పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడ్ని పరిశీలించగా వడదెబ్బతో చనిపోయినట్లు గుర్తించారు. వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. సమాచారం తెలిసిన వారు జగద్గిరిగుట్ట పోలీసులను సంప్రదించాలని కోరారు.

## అనుమానాస్పద స్థితిలో ..

శేరిలింగంపల్లి : అనుమానాస్పద స్థితిలో కార్పెంటర్ మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఉత్తరప్రదేశ్ కు చెందిన జిందాల్(50) భార్య, ముగ్గురు పిల్లలతో ఆరేండ్ల నగరానికి వచ్చి కొండాపూర్ మజీద్‌బండలో నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం మజీద్‌బండలో నిర్మాణంలో ఉన్న భవనంలో కార్పెంటర్ పనిచేస్తుండగా కుప్పకూలి కిందపడ్డాడు. తోటి కార్మికులు జిందాల్‌ను సమీపంలోని దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం



బీసీ రిజర్వేషన్లను సాధించడంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చిత్రపటానికి శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం నిర్వహించారు. సీనియర్ నాయకులు కోడూరి శ్రీధర్‌సాగర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, అంబటి శ్రీనివాస్, చిరు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

– కార్వాన్, మార్చి 21

## అవసరమైన చోట్ల కొత్త పోలింగ్ బూత్‌లు

### జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 21: అవసరమైన చోట్ల కొత్త పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే కాకుండా క్రమం తప్పకుండా సమావేశమై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలను, సూచనలను పరిగణనలోనికి తీసుకొని భారత ఎన్నికల కమిషన్‌కు పంపుతామన్నారు. జిల్లాలో జనాభా పెరుగుతున్నందున ఓటర్లు కూడా పెరగడం జరుగుతుందని, అం దుకనుగుణంగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని పార్టీ ప్రతినిధులకు సూచించారు. సరళీకృత ఓటరు జాబితాలను అవసరమైన మేరకు ఎప్పటికప్పుడు మార్పులు, చేర్పులు చేస్తూ ఆ మార్పుల వివరాలను బీఎల్‌ఓలు ఓటర్లకు తెలియజేయాలని తెలిపారు. బూ తులను షిఫ్ట్ చేయడం కష్టమని, అవసరమైన మేరకు కొత్త పోలింగ్ బూతులను ఏర్పాటు చేస్తామని, ఒకే కుటుంబసభ్యులు వేర్వేరు బూతులలో ఓటరు నమోదు ఉన్నట్లయితే ఫామ్-8లో బూతు మార్పుకు అప్లై చేసుకోవాలని సూచించారు. ప్రతినిధుల సూచనల మేరకు తండాలలో పరిశీలించి అవసరమైన చోట కొత్త బూతులను ఏర్పాటు చేస్తామని, రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందరరెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

శామీర్‌పేట, మార్చి 21 : పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల కోసం మౌలిక సదుపాయాలు కల్పించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూంకుంటను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా తరగతి (పరీక్ష కేంద్రాలు)గదుల్లోకి వెళ్లి పరీక్షలు రాయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు సౌకర్యాలు వంటివి ఉన్నాయా? అని ఎంఈఓను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. టెన్త్ పరీక్షలు పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పరీక్షలు సజావుగా నిర్వహించేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలన్నారు. ఈ పర్యటనలో శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంఈవో కమలాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.




వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్

## కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవా రం కూరగాయల ధరలు (కేజీ - రూపాయలు) ఈ విధంగా ఉన్నాయి. టమాట 11, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 40, బజ్జి మిర్చి 23, కాకర 45, బీర 38, క్యాబేజి10, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 16, కాలీఫ్లవర్ 18, దొండ 40, చిక్కుడు 50, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 16, క్యాప్సికం 40, ఆలు 25, కీరా 16, దోస 20, సోరకాయ 15, పొట్లకాయ (1) 15, కందగడ్డ 60, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 24, మామిడికాయ (1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడి 30, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చిబఠానీ 40, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9 : 30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

మాదాపూర్ : దోపిడీ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన శుక్రవారం మియాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. లంగర్ హౌస్‌కు చెందిన ఎండీ జావేద్ జొమాటోలో ఫుడ్ డెలివరీ బాయ్. 7న సాయంత్రం 7 గంటలకు ఫుడ్‌ఆర్డర్ రావడంతో గోకుల్‌ప్లాట్‌లోని ఓ హోటల్ నుంచి ఆహారం తీసుకొని హోండా షైన్ (టీఎస్ 11 ఈఈ 1382)పై వెళ్తూ గోకుల్ ప్లాట్ వద్ద యూటర్న్ తీసుకుంటూ ఉండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు డెలివరీ బాయ్ ని స్కూటీతో అడ్డగించి హెల్మెట్‌తో దాడి చేశారు. రూ. 5వేలతో పాటు అతడి రెండు మొబైల్ ఫోన్లను లాక్కున్నారు. పోలీసులకు చెబితే చంపేస్తామని బెదిరించడంతో కుటుంబసభ్యులకు తెలియకుండా అతడు బీహార్‌కు వెళ్లాడు. జావేద్ ఇంటికి రాకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు చివరి ఫోన్‌సిగ్నల్ మియాపూర్ వరకు వచ్చినట్లు గుర్తించారు. దీంతో మియాపూర్ పీఎస్‌లో జావేద్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వారం తర్వాత విషయాన్నీ తన అన్నకు ఫోన్ చేసి తెలుపగా.. అన్న అజ్మల్ హుస్సేన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులు గచ్చిబౌలి ఏఎంబీ మాల్ వద్ద ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారించగా ఏ - 1 కూకట్‌పల్లికి చెందిన బర్సోటి ఆగమయ్య , జగద్గిరిగుట్టకు చెందిన ఏ -2 నిందితుడు బసవడి అభిషేక్‌గా తెలిసింది. విచారణలో నేరం అంగీకరించిన వారు దీంతోపాటు గచ్చిబౌలి, మధురా నగర్, జూబ్లీహిల్స్ పరిధిలో మూడు అస్తినేరాలను చేసినట్లు తెలిపారు. పోలీసులు వారి వద్ద మొబైల్ ఫోన్లు 10, బంగారు ఉంగరం, ఇయర్ బడ్స్, ఓ స్కూటీ (టీఎస్ 08 హెచ్‌యూ 6227) ని స్వాధీనం చేసుకొని దోపిడి నేరం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.